నేటి మ్యాచ్‌లు: అమెరికా X కెనడా ఉ.6.00 | వెస్టిండీస్ X పపువా న్యుగినియా రా.8.00

# ధనాధన్‌కు సై

నేటి నుంచి టీ20 ప్రపంచకప్ టోర్నీ

వెస్టిండీస్, అమెరికా వేదికలుగా మ్యాచ్‌లు

**నాలుగు గ్రూపులతో 20 జట్లు బరిలోకి • టైటిల్ ఫేవరేట్స్‌గా భారత్, ఇంగ్లండ్, ఆసీస్**

**ధనాధన్‌కు ధమాకాకు రంగం సిద్ధమైంది. మండు వేసవిలో ఐపీఎల్‌ను ఆస్వాదించిన అభిమానులకు ఇప్పుడు టీ20 ప్రపంచకప్ రూపంలో మరో మెగాటోర్నీకి రానే వచ్చేసింది. అమెరికా, వెస్టిండీస్ వేదికలుగా ఫోర్లు, సిక్సర్లతో అలరించేందుకు క్రికెటర్లు కదనోత్సాహంతో ఉన్నారు. గతానికి భిన్నంగా 20 జట్లతో కలయికతో దాదాపు నెల రోజుల పాటు జరుగబోతున్న మెగాటోర్నీ పలు కొత్త రికార్డులకు వేదిక కాబోతున్నది. బేస్‌బాల్, బాస్కెట్‌బాల్‌ను అమితంగా ప్రేమించే అగ్రరాజ్యం అమెరికా గడ్డపై క్రికెట్‌కు ఆదరణ కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఐదేసి జట్లు నాలుగు గ్రూపులుగా బరిలోకి దిగుతున్న టోర్నీలో భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, పాకిస్థాన్ టైటిల్ ఫేవరేట్లుగా సై అంటున్నాయి. తమదైన రోజున ఎంతటి మేటి జట్టునైనా మట్టికరిపించే టీమ్‌ఇండియా తమ సుదీర్ఘ కలను సాకారం చేసుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నది. ఆతిథ్య అమెరికా, కెనడా పోరుతో మెగాటోర్నీకి ఆదివారం ఉదయం తెరలేవబోతున్నది.**



**ఏ గ్రూపులో ఏ జట్లు**

- గ్రూపు-ఏ: భారత్, పాకిస్థాన్, యూఎస్‌ఏ, కెనడా, ఐర్లాండ్
- గ్రూపు-బీ: ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, నమీబియా, ఒమన్, స్కాట్లాండ్
- గ్రూపు-సీ: వెస్టిండీస్, న్యూజిలాండ్, అఫ్గానిస్థాన్, పపువా న్యుగినియా, ఉగాండా
- గ్రూపు-డీ: దక్షిణాఫ్రికా, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, నెదర్లాండ్స్

న్యూయార్క్: పొట్టి ప్రపంచకప్ పోరుకు సమయం ఆసన్నమైంది. ఆదివారం ఉదయం ఆరు గంటలకు అమెరికా, కెనడా మధ్య పోరుతో టీ20 ప్రపంచకప్ టోర్నీ అధికారికంగా ప్రారంభం కాబోతున్నది. తొలిసారి మెగాటోర్నీకి ఆతిథ్యమిస్తున్న అమెరికా అందుకు తగ్గట్లు భారీ ఏర్పాట్లు చేసింది. డల్లాస్‌లోని గ్రాండ్ ప్రెయరీ స్టేడియంలో సరిహద్దు దేశాలు అమెరికా, కెనడా ముఖాముఖి తలపడనున్నాయి. మరోపోరులో పసికూన పపువా న్యుగినియా.. మాజీ చాంపియన్ వెస్టిండీస్‌ను ఎదుర్కొనుంది. ఇదిలా ఉంటే మెగాటోర్నీలో టైటిల్ ఫేవరేట్‌గా భావిస్తున్న భారత్..ఈ నెల 5న తమ తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌తో ఆడుతుంది. మొత్తంగా దాదాపు 30 రోజుల వ్యవధిలో టోర్నీలో 55 మ్యాచ్‌లు జరుగుతాయి. లీగ్ దశ మ్యాచ్‌లకు అమెరికా ఆతిథ్యమిస్తుండగా, అటు లీగ్‌తో పాటు సూపర్-8, సెమీఫైనల్స్, ఫైనల్ పోరు వెస్టిండీస్ దీవుల్లో జరుగనున్నాయి.

**4 గ్రూపులు..20 జట్లు:**

గతానికి భిన్నంగా క్రికెట్‌ను విశ్వవ్యాప్తం చేయాలన్న ఐసీసీ ప్రణాళికలో భాగంగా ఈసారి జట్ల ప్రాతినిధ్యాన్ని 20కి పెంచారు. 2022లో టాప్-8లో నిలిచిన జట్లు ఈ మెగాటోర్నీకి నేరుగా అర్హత సాధించాయి. దీనికి తోడు ఆతిథ్య హోదాలో అమెరికా, వెస్టిండీస్ టోర్నీలోకి వచ్చాయి. మిగతా జట్ల విషయానికొస్తే..యూరోపియన్ క్వాలిఫయర్ నుంచి ఐర్లాండ్, స్కాట్లాండ్, అమెరికా క్వాలిఫయర్ నుంచి కెనడా, ఆసియా క్వాలిఫయర్ నుంచి నేపాల్, ఒమన్, ఆఫ్రికా క్వాలిఫయర్ నుంచి నమీబియా, ఉగాండా, ఈస్ట్ ఆసియా పసిఫిక్ క్వాలిఫయర్ నుంచి పపువా న్యుగినియా బెర్తులు దక్కించుకున్నాయి.

**ఫార్మాట్ ఇలా:**

ఈ ప్రపంచకప్‌లో మొత్తం 20 జట్లు ఐదేసి జట్లతో నాలుగు గ్రూపులుగా విడిపోతాయి. ఇందులో ఒక్కో జట్టు నాలుగు మ్యాచ్‌లు ఆడుతుంది. నాలుగు గ్రూపుల్లో టాప్-2లో నిలిచే జట్లు సూపర్-8కు అర్హత సాధిస్తాయి. ఈ ఎనిమిది జట్లు రెండు గ్రూపులుగా విడిపోయి మూడు మ్యాచ్‌లు ఆడుతాయి. టాప్-2లో నిలిచిన జట్లు సెమీఫైనల్లో నిలుస్తాయి.

**నిబంధనలు ఇలా:**

ప్రపంచకప్‌లో ఏ మ్యాచ్ టై అయినా..ఫలితం కోసం సూపర్ ఓవర్ ఆడిస్తారు. ఒకవేళ సూపర్ ఓవర్ టై అయితే ఫలితం వచ్చే వరకు మళ్లీ ఆడిస్తారు. గ్రూపు దశలో, సూపర్-8 దశలో వర్షం అంతరాయం కల్గిస్తే..ఇరు జట్లు కనీసం ఐదు ఓవర్ల పాటు మ్యాచ్ ఆడాల్సి ఉంటుంది. లేదంటే ఇరు జట్లు పాయింట్లు సమంగా పంచుకుంటాయి. లీగ్ దశతో పాటు సూపర్-8కు రిజర్వ్ డే లేవు. నాకౌట్ దశలో ఫలితం కోసం ఇరు జట్లు కనీసం 10 ఓవర్ల పాటు ఆడాల్సి ఉంటుంది. నాకౌట్ దశలో తొలి సెమీస్‌కు మాత్రం రిజర్వ్ డేను కేటాయించగా, రెండో సెమీస్‌కు, ఫైనల్‌కు ఒక రోజే విరామం ఉండటంతో రెండో సెమీస్‌కు రిజర్వ్ డే లేకుండా పోయింది. అయితే తొలి సెమీస్‌కు మ్యాచ్ ఫలితం తేలేందుకు అదనంగా 190 నిమిషాలు కేటాయించగా, రెండో సెమీస్‌కు 250 నిమిషాలు ఇచ్చారు. దీనికి తోడు ఈసారి కొత్తగా స్టాప్‌క్లాక్‌ను తీసుకొచ్చారు. దీని ప్రకారం ఇరు జట్లు తమ ఇన్నింగ్స్‌ను నిర్ణీత సమయంలో ముగించాల్సి ఉంటుంది. లేకుంటే ఆయా జట్లపై పెనాల్టీ పడుతుంది.

# గాయత్రి జోడీకి నిరాశ



సింగపూర్: సింగపూర్ ఓపెన్‌లో సంచలన విజయాలతో దుమ్మురేపిన భారత యువ ద్వయం గాయత్రి గోపీచంద్, త్రిసా జాలీకి నిరాశే ఎదురైంది. శనివారం జరిగిన మహిళల డబుల్స్ సెమీస్‌లో గాయత్రి, త్రిసా జోడీ 21-23, 11-21తో జపాన్ జంట నమి మత్సుయమ, చిహారు శిదా చేతిలో ఓటమిపాలయ్యారు. గత రెండు మ్యాచ్‌ల్లో తమ కంటే మెరుగైన ర్యాంక్ ప్లేయర్లపై గెలిచిన అన్‌సీడెడ్ గాయత్రి, త్రిసా..అదే జోరును సెమీస్‌లో కొనసాగించలేకపోయారు. 47 నిమిషాల పాటు జరిగిన పోరులో ప్రపంచ నంబర్-4 జోడీకి దీటైన పోటీనిచ్చేందుకు ప్రయత్నించినా సఫలం కాలేకపోయారు. వీరి నిష్క్రమణతో టోర్నీలో భారత్ పోరాటం ముగిసింది.

## చెన్నై, సింగపూర్‌కు పోటీగా ఢిల్లీ

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక చెస్ ప్రపంచ చాంపియన్‌షిప్ నిర్వహణకు పోటీ బాగా పెరిగింది. ఇప్పటికే చెన్నై, సింగపూర్ ఈ రేసులో ఉండగా ఇప్పుడు తాజాగా ఢిల్లీ చేరింది. చెన్నై ఆతిథ్యం కోసం తమిళనాడు ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రంగంలోకి ఆల్ఇండియా చెస్ ఫెడరేషన్ ఢిల్లీని రేసులోకి దింపింది. అయితే ఆతిథ్య హక్కుల కోసం ప్రస్తుతం మూడు నగరాలు బిడ్లు దాఖలు చేశాయని అంతర్జాతీయ చెస్ ఫెడరేషన్ (ఫిడే) సీఈవో ఎమిల్ సుతోవ్‌స్కీ పేర్కొన్నాడు. ఆయా నగరాల్లో ఉన్న ప్రమాణాలను పరిశీలనలోకి తీసుకుంటూ ఫిడే కౌన్సిల్‌లో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించాడు.

## సబలెంకా హ్యాట్రిక్

**ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ**



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో బెలారస్ బ్యూటీ ఎరీనా సబలెంకా వరుస విజయాల పరంపర దిగ్విజయంగా కొనసాగుతున్నది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్ పోరులో రెండో సీడ్ సబలెంకా 7-5, 6-1తో పౌలా బడోసా(స్పెయిన్)పై అలవోక విజయం సాధించింది. గంటా 17 నిమిషాల పాటు జరిగిన పోరులో సబలెంకాను దీటైన పోటీనిచ్చేందుకు బడోసా ప్రయత్నించింది. గాయం నుంచి కోలుకుని బరిలోకి దిగిన బడోసా తొలి సెట్‌లో హోరాహోరీగా పోరాడింది. అయితే బలమైన ఫోర్‌హ్యాండ్, పదునైన ఏస్‌లతో విజృంభించిన సబలెంకా ప్రత్యర్థికి ఎక్కడా అవకాశమివ్వలేదు. తొలి సెట్‌ను 7-5తో కైవసం చేసుకున్న ఈ రెండో సీడ్..మలి సెట్‌ను మరింత అలవోకగా తన ఖాతాలో వేసుకుంది. మ్యాచ్‌లో సబలెంకా 28 విన్నర్లు కొడితే..బడోసా 15కు పరిమితమైంది. అయితే 17 సార్లు అనవసర తప్పిదాలకు పాల్పడటం బడోసా ఓటమికి కారణమైంది. మిగతా మ్యాచ్‌ల్లో రిబకినా 6-4, 6-2తో మెర్టెన్స్‌పై, గ్రచెవా 7-5, 6-3తో బెగుపై విజయాలతో ముందంజ వేశారు.

# పంత్, పాండ్యా అదుర్స్

**బంగ్లాతో వామప్ మ్యాచ్‌లో భారత్ విజయం**




న్యూయార్క్: టీ20 ప్రపంచకప్‌లో భారత్‌కు అదిరిపోయే ప్రాక్టీస్ లభించింది. అమెరికాలో తొలిసారి బరిలోకి దిగిన టీమ్‌ఇండియా అక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకుంది. శనివారం జరిగిన వామప్ మ్యాచ్‌లో భారత్ 60 పరుగుల తేడాతో బంగ్లాపై భారీ విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన రోహిత్‌సేన నిర్ణీత 20 ఓవర్లలో 182/5 స్కోరు చేసింది. రిషబ్ పంత్(53 రిటైర్డ్ ఔట్), హార్దిక్ పాండ్యా(40 నాటౌట్) రాణించారు. ఓపెనర్‌గా వచ్చిన సంజూ శాంసన్(1) తొలి ఓవర్‌లోనే నిష్క్రమించాడు. ఆ తర్వాత వన్‌డౌన్‌లో వచ్చిన పంత్ వచ్చిన అవకాశాన్ని చక్కగా సద్వినియోగం చేసుకున్నాడు. రోహిత్(23) జతగా ఇన్నింగ్స్‌కు కొత్త ఊపు తీసుకొచ్చాడు. ఒంటిచేత్తో తనదైన శైలిలో సిక్సర్లు కొడుతూ అలరించాడు. మిడిలార్డర్‌లో సూర్యకుమార్(31) మెరుపులు మెరిపించగా, శివమ్‌దూబే(14) ఫర్వాలేదనిపించాడు. ఆఖర్లో పాండ్యా దూకుడుగా ఆడటంతో భారత్‌కు పోరాడే స్కోరు దక్కింది. మెహదీహసన్, ఇస్లాం, మహ్మదుల్లా, తన్వీర్ ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన బంగ్లా 122/9 స్కోరుకు పరిమితమైంది. అర్ష్‌దీప్(2/12), దూబే(2/13) ధాటికి బంగ్లా బ్యాటర్లు తేలిపోయారు. మహ్మదుల్లా(40), షకీబ్‌అల్‌హసన్(28) ఆకట్టుకోగా, మిగతావారు పేలవ ప్రదర్శన కనబరిచారు. బుమ్రా, సిరాజ్, హార్దిక్, అక్షర్ ఒక్కో వికెట్ తీశారు.



## మనుకు స్వర్ణం

న్యూఢిల్లీ: తైవాన్ ఓపెన్‌లో భారత యువ జావెలిన్ త్రోయర్ డీపీ మను పసిడి పతకంతో మెరిశాడు. శనివారం జరిగిన పురుషుల జావెలిన్‌త్రో ఈవెంట్‌లో మను..బరిసెను 81.58మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం గెలిచిన మను.. తన ఆఖరి అవకాశంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాడు. తొలుత ఈటెను 78.32మీటర్ల విసిరిన ఈ 24 ఏండ్ల యువ అథ్లెట్ రౌండ్ రౌండ్‌కు దూరాన్ని పెంచుకుంటూ పోయాడు. ఈ క్రమంలో తన అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన (84.35మీ) అందుకోలేకపోయిన మను.. టాప్‌తో స్వర్ణాన్ని సొంతం చేసుకున్నాడు.



## క్రికెట్‌కు కార్తీక్ వీడ్కోలు

చెన్నై: భారత మాజీ వికెట్‌కీపర్ దినేశ్ కార్తీక్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అన్ని రకాల ఫార్మాట్ల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించాడు. వాస్తవానికి ఐపీఎల్‌లో ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఓటమి తర్వాతే రిటైరవుతున్నట్లు పేర్కొన్నా.. శనివారం ఎక్స్ వేదికగా అధికారికంగా వెల్లడించాడు. ఈ సందర్భంగా కార్తీక్ కొన్ని అంశాలను పంచుకున్నాడు. 'కొంత కాలం నుంచి క్రికెట్‌కు వీడ్కోలు పలికేందుకు ఆలోచిస్తున్నా. ఆ సమయం రానే వచ్చింది. పోటీ క్రికెట్‌కు దూరంగా ఉండాలన్న నిర్ణయానికి వచ్చాను. భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాను' అని అన్నాడు. భారత్ తరఫున మూడు ఫార్మాట్లలో కలిపి 180 మ్యాచ్‌లాడిన దినేశ్.. 3463 పరుగులు చేశాడు. టెస్టుల్లో ఒక సెంచరీ, 17 అర్ధసెంచరీలు ఖాతాలో వేసుకున్న కార్తీక్..వికెట్‌కీపర్‌గా 172 ఔట్లలో పాలుపంచుకున్నాడు.

## రైతులకిచ్చిన హామీలను నెరవేర్చండి

• తుమ్మలకు రైతు సంఘం వినతి

హైదరాబాద్, జూన్ 1(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రైతు సంఘాల నేతలు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శనివారం సచివాలయంలో కలిసి విన్నవించారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, కోదండరెడ్డితో కలిసి మంత్రి తుమ్మల రైతు సంఘం నేతలతో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రైతు సంఘాల నేతలు కన్నెగంటి రవి, పశ్య పద్మ, కిరణ్, పాకాల శ్రీహరిరావు కౌలు రైతుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సాగర్, కిరణ్ భూ యజమాన్య హక్కులు, వాటి చట్టాలను సవరించాల్సిన ఆవశ్యకతను వివరించారు. అన్వేష్‌రెడ్డి, నల్లమల వెంకటేశ్వరరావు జీలుగ, పత్తి విత్తనాల లభ్యత గురించి మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మంత్రి తుమ్మల, చిన్నారెడ్డి మాట్లాడుతూ.. రైతు శ్రేయస్సుకు అవసరమయ్యే పథకాలపై క్యాబినెట్ లో చర్చించి అమలు చేస్తామని తెలిపారు. అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండ రెడ్డి రైతుభరోసా, రుణ మాఫీ, పంటల బీమాపై రైతు సంఘాలతో చర్చించారు.




వంగపల్లిలోని వీరగల్లు విగ్రహాన్ని చూపుతున్న రత్నాకర్‌రెడ్డి

## వంగపల్లిలో 'వీరగల్లు' గుర్తింపు

మద్దూరు (ధూళిమిట్ట), జూన్ 1: సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వంగపల్లిలో చాళుక్యుల కాలం నాటి వీరగల్లు విగ్రహాన్ని గుర్తించినట్టు పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన వీరగల్లు విగ్రహ విశేషాలను వెల్లడించారు. గ్రామంలోని బురుజు వద్ద ఉన్న ఈ విగ్రహాన్ని ఇటీవల దుర్గమ్మ ఆలయం వద్ద గ్రామస్థులు ప్రతిష్ఠించినట్టు తెలిపారు. ఈ విగ్రహంలో ఉన్న వ్యక్తి వేట కుక్కల సాయంతో అడవి పందుల నుంచి పంట చేలను కాపాడే ప్రయత్నంలో ప్రాణాలు పోగొట్టుకున్న గ్రామ వీర సైనికుడిగా గుర్తించినట్టు పేర్కొన్నారు.

# వైద్యులపై న్యాయమూర్తి ఫైర్

- గద్వాల దవాఖాన తనిఖీ
- సంతకాలు చేసి డ్యూటీలో లేకపోవడంపై ఆగ్రహం



గద్వాల దవాఖానలో రోగితో మాట్లాడుతున్న జడ్జి కవితాదేవి

గద్వాల అర్బన్ :'వైద్యులు విధులకు హాజరుకాకపోయినా రిజిస్టర్‌లో మాత్రం సంతకాలు ఉన్నాయి. ప్రస్తుతం ఒక్కరే డ్యూటీలో ఉన్నారు. మిగతా వారు ఎక్కడ? ఇది ప్రభుత్వ దవాఖాన? లేక ప్రైవేటుదా? అసలు సమయ పాలన వర్తించదా?' అంటూ వైద్యులపై జిల్లా న్యాయమూర్తి జీ కవితాదేవి ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. హాజరు పట్టికలో 38 మంది వైద్యులకుగాను 18 మంది సంతకాలు చేయగా, విధుల్లో ఒక్కరే ఉండటంతో ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ల కోసం పడిగాపులు కాయాల్సి వస్తుందని, ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు పోతారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొన్నదని పలువురు రోగులు జడ్జి దృష్టికి తీసుకొచ్చారు.

# మేడిగడ్డను సందర్శించిన నిపుణుల కమిటీ



మేడిగడ్డ బరాజ్ వద్ద పనులను పరిశీలిస్తున్న స్టేట్ జ్యుడీషియల్ బృందం

మహదేవపూర్, జూన్ 1: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లోని మేడిగడ్డ బరాజ్‌ను ఈఎన్సీ అనిల్‌కుమార్ నేతృత్వంలో రాష్ట్ర నిపుణుల కమిటీ శనివారం పరిశీలించింది. బరాజ్ కుంగుబాటుకు గల కారణాలు, లోపాల అధ్యయానికి ప్రభుత్వం జ్యుడీషియల్ కమిషన్ వేసింది. గతంలో బరాజ్‌ను పరిశీలించిన కమిషన్ తాజాగా శనివారం ఎన్‌డీఎస్‌ఏ సూచన మేరకు బరాజ్ దిగువన 7వ బ్లాక్ వద్ద జరుగుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించింది. బరాజ్ దిగువన అప్, డౌన్ స్ట్రీమ్ 7, 8వ బ్లాకుల పనులను పరిశీలించారు. కాపర్ సీట్ పైల్స్ పనులు, సీసీ బ్లాక్ అమరిక, 20, 21 గేట్ల కటింగ్, కుంగిన ప్రాంతంలో సిమెంట్, ఇసుకతో పూడ్చేందుకు చేపట్టిన పనుల వివరాలను ఇంజినీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థ ఎల్టీ ప్రతినిధులను అడిగి తెలుసుకుని, ఫొటోలు తీసుకున్నారు. కాళేశ్వరంలోని అన్నారం (సరస్వతి) బరాజ్‌ను సందర్శించి లీకేజీ పనులను పరిశీలించారు.

**మేడిగడ్డ వద్ద 'గ్రౌటింగ్' ప్రారంభం**

మేడిగడ్డ బరాజ్ వద్ద కుంగిన 19, 20, 21వ పియర్స్ వద్ద ఏర్పడిన ఖాళీ ప్రదేశాలను పూడ్చేందుకు సి మెంట్, ఇసుకతో గ్రౌటింగ్ పనులను నిర్మాణ సంస్థ ప్రారంభించింది. గ్రౌటింగ్ కోసం కుంగిన ప్రాంతంలో బోర్‌వెల్స్ పనులను చేపట్టారు. వీటి ద్వారా సిమెంట్, ఇసుక మిశ్రమంతో గ్రౌటింగ్ యంత్రాల సాయంతో 7వ బ్లాకులో కుంగిన పిల్లర్లను పూడ్చుతున్నారు.

# యాదాద్రి ప్లాంట్ టెండర్లపై విచారణ

- మూడు నెలల్లోపు సర్కార్‌కు నివేదిక
- విచారణ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

దామరచర్ల, జూన్ 1 : యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణ పనుల టెండర్ల అవార్డుపై అభిప్రాయాలను సేకరిస్తున్నామని యాదాద్రి పవర్‌ప్లాంట్ విచారణ కమిటీ చైర్మన్, పాట్నా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నర్సింహారెడ్డి తెలిపారు. శనివారం నల్లగొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి పవర్‌ప్లాంట్‌ను సందర్శించి పనులను పరిశీలించారు. టీజీ జెన్‌కో, బీహెచ్ఈఎల్ అధికారులతో సమావేశమై వివరాలు సేకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. యాదాద్రి పవర్ ప్లాంట్ టెండర్లు, భద్రాద్రి పవర్ ప్లాంట్ సూపర్ క్రిటికల్ లేదా సబ్ క్రిటికల్, ఛత్తీస్‌గఢ్ నుంచి కొనుగోలు చేసిన విద్యుత్తుపై విచారణ జరుపుతున్నట్టు తెలిపారు. యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణ పనులకు టెండర్లు వేయకుండా బీహెచ్ఈఎల్‌కు కాంట్రాక్ట్ ఇవ్వడంపై విచారణ జరుపుతున్నట్టు పేర్కొన్నారు. నిర్ణయాలు తీసుకున్న వారికి, పనుల్లో భాగస్వాములైన వారికి ఉత్తరాలు రాసినట్టు చెప్పారు. వారి వివరణతోపాటు ప్రజలు అభిప్రాయాలు తెలుపాలని పబ్లికేషన్ ఇచ్చినట్టు తెలిపారు. పలువురు వ్యక్తిగతంగా, మరికొన్ని స్వచ్ఛంద సంస్థలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేసినట్టు వివరించారు. త్వరలోనే నేరుగా వారి అభిప్రాయాలు తీసుకొని నివేదిక రూపొందిస్తామని చెప్పారు. ఫిర్యాదులపై సరైన ఆధారాలు, రుజువులు ఉంటేనే కమిషన్ పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించామని తెలిపారు. మూడు నెలల్లోపు నివేదిక అందిస్తామని చెప్పారు. ఆయన వెంట ప్రాజెక్ట్ సీఈ సమ్మయ్య, జెన్‌కో అధికారులు ఉన్నారు.






Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.